www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 15 సెప్టెంబర్ 2023 | 5 | కాకినాడ



విశ్వజన కళామండలి అవార్డులకు ఎంపిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

విశ్వజన కళామండలి 45వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రంలో వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన పలువురికి అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డులు ఇవ్వనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు తెలిపారు. ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పేదప్రజలకు, కరోనా సమయంలో ప్రజలకు అందించిన విశేష సేవలకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. అంబేద్కర్ ఆలోచనా విధానంతో పాటుగా బౌద్ధ ధమ్మ వ్యాప్తికి కృషి చేస్తూ, వివిధ రకాలుగా ప్రజలను, యువతను చైతన్యం చేస్తున్న బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ప్రముఖ న్యాయవాది, యడ్ల కుటుంబరావును జాతీయ అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపిక చేశారు.

రాయబార ర్యాలీ అడ్డగింత, అరెస్టులు

ప్రజాశక్తి-తుని, పిఠాపురం

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ గురువారం తునిలో మంత్రి దాడిశెట్టి రాజా ఇంటి వద్దకు చేపట్టిన రాయబార ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. కార్మికులను, సిఐటియు నాయకులను అరెస్టు చేశారు. పోలీసు స్టేషన్లకు తరలించారు. సిఐటియు నాయకులు చెక్కల రాజకుమార్, నక్కల శ్రీనివాస్, ఎస్‌కె.పద్మ ఆధ్వర్యంలో వందలాదిగా వచ్చిన సిఐటియు నాయకులు, భవన కార్మికులు తుని ఏరియా ప్రభుత్వాసుపత్రి నుంచి ర్యాలీగా బయల్దేరి వెళుతుండగా పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. వారిని అరెస్టు చేసి కోటనందూరు, తుని రూరల్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హక్కులను చట్టాలను కాపాడాలని నినదించారు. శాంతియుతంగా ర్యాలీ చేసి మంత్రికి వినతిపత్రాన్ని అందజేసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చేస్తున్న ర్యాలీని అడ్డుకోవడం అన్యాయమన్నారు. కోటనందూరు పోలీస్ స్టేషన్‌కు సుమారు 25 మందిని, నాయకురాలు ఎస్‌కె.పద్మను తరలించగా, అమర్, మరికొంతమందిని ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించారు.

ఎపి భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులను బుధవారం సాయంత్రం, గురువారం తెల్లవారుజామున గృహ నిర్బంధం చేశారు. జిల్లా నలుమూలల నుంచి తుని వస్తున్న కార్మికులను ఎక్కడికక్కడ రహదారులపై నిర్బంధించారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకుని తుని రాజా గ్రౌండ్ వద్దకు చేరుకున్న కార్మికులు ర్యాలీగా బయల్దేరడంతో తుని రూరల్ సిఐ సన్యాసిరావు ఆధ్వర్యంలో లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. పోలీసులను తోసుకుని మంత్రి ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించగా అరెస్టులు చేసి తుని టౌన్, రూరల్ స్టేషన్, కోటనందూరు, తొండంగి స్టేషన్లకు తరలించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జిని అరెస్టు చేసి పెదపూడి స్టేషన్‌కు తరలించారు. కాకినాడ నగర అధ్యక్షులు పలివెల వీరబాబును ఇంద్రపాలెం స్టేషన్‌కు తరలించారు. పిఠాపురంలో కుంచే చిన్న, కరణం విశ్వనాథం, గడిగట్ల సత్తిబాబులను ముందస్తు గృహనిర్బంధం చేశారు. అరెస్టులు ఖండిస్తూ సిఐటియు ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడారు. ప్రభుత్వంపై భారం లేకపోయినా, లేబర్ సెస్ ద్వారా కార్మికులు దాచుకున్న సొమ్ము నుంచి పరిహారాలు చెల్లించకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్ల నుండి భవననిర్మాణ కార్మికులకు అన్యాయం చేసిందని విమర్శించారు. దారపురెడ్డి క్రాంతి, మేడిశెట్టి వెంకటరమణ, మాగాపు నాగు, చెక్కల రాజ్‌కుమార్, నక్కెళ్ల శ్రీనులను పోలీసులు సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్ల శ్రీను, ఉపాధ్యక్షుడు దేగల సత్యన్నారాయణ, చింతల సత్యన్నారాయణ, కళ్ల నాగేశ్వరరావు, యు.కొత్తపల్లి సత్యన్నారాయణ, మురారి సూర్యనారాయణ, సురేంద్ర, కామేశ్వరి, తైనాల శ్రీను, గునూరి రమణ, పులగరసెట్టి శ్రీను, బొజ్జా నూకరాజు, కొట్టం రమణ, వైలేటి అప్పారావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తునిలో అడ్డగిస్తున్న పోలీసులు

పిఠాపురంలో నేతల నిర్బంధం

ఇంద్రపాలెం పోలీసు స్టేషన్‌లో నాయకులు

కార్మికుల అరెస్టుకు నిరసనగా ఆందోళన

పెద్దాపురం : మంత్రి దాడిశెట్టి రాజా వద్దకు వెళుతున్న భవన నిర్మాణ కార్మికులను అరెస్టు చేయడానికి నిరసిస్తూ పెద్దాపురం మెయిన్ రోడ్ వినాయకుని గుడి సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారన్నారు. సంక్షేమ బోర్డును సాధించేంతవరకు భవన నిర్మాణ కార్మికులు నిర్మాణాలు లెక్కచేయకుండా పోరాటాలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, యాసలపు రమేష్, టిఎల్.పద్మావతి, స్నేహలత, సావిత్రి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తైనాల శ్రీను, గూనూరు వెంకటరమణ, డి.శివ, ముమ్మన నాగు, గడపా వీరబాబు, ఆరు వీర్రాజు, డి.కృష్ణ పాల్గొన్నారు.

నేతల అరెస్టులపై సిపిఎం ఖండన

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా మంత్రి దాడిశెట్టి రాజాను కలిసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని వినతిపత్రం ఇవ్వడానికి సామూహిక రాయబారం కోసం వెళుతున్న సిఐటియు నాయకత్వాన్ని అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఒక ప్రకటనలో ఖండించారు. మంత్రి దాడిశెట్టి రాజాతో తమ సమస్యలను చెప్పుకుంటే ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని ఆశించి కార్మికులంతా మంత్రి ఇంటికి వెళ్తుంటే ఎక్కడికక్కడే అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం చాలా దారుణం అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేష బాబ్జిని అర్ధరాత్రి సమయంలో అరెస్టు చేసి పెదపూడి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి నిర్బంధించి భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. సిఐటియు ఆలిండియా ఉపాధ్యక్షురాలు జిబి రాణిని హౌస్ రెస్ట్ చేయడం, సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబును తెల్లవారుజామున అరెస్టు చేసి ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం హేయమైన చర్యలుగా ఆయన తప్పు పట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి అణచివేత ధోరణిని మానుకుని ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి వారికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడానికి విద్యార్థులు పెద్ద ఎత్తున పోరాడాలని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లావ్యాప్తంగా నిర్వహించిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ముగింపు సభ కాకినాడ మెక్లారిన్ స్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించారు. 7 రోజులపాటు 200 కిలోమీటర్లు ఈ యాత్ర సాగింది. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పి.వరహాలు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను తిరోగమన దిశలో నడిపిస్తోందన్నారు. విద్యారంగం ప్రయివేటీకరణకు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూనుకుంటోందని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లు, కళాశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలో పలు ప్రాంతంలోని విద్యాసంస్థలను సందర్శించారు.

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్యాన్లు లేవని, ఇంతవరకు పాఠ్యపుస్తకాలు అందలేదని తెలిపారు. జిఒ 77ను ప్రవేశపెట్టి పీజీ విద్యార్థులకు విద్యాదీవెన లేకుండా చేశారని, దీంతో పేదలు ఉన్నత చదువులకు వెళ్లకుండా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేశారన్నారు. జిఒలు 107, 108 ద్వారా వైద్య విద్యను ప్రయివేటుపరం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, నాడు-నేడు ద్వారా మరమ్మతులకు నిధులు కేటాయించాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు రూ.3 వేలకు పెంచాలని, సన్న బియ్యం సరఫరా చేయాలని, పీజీ విద్యార్థులకు విద్యా దీవెన అందించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు శ్రీకాంత్, వాసు, కృప, సాహిత్, లోవరాజు, సిద్ధు, చిన్ని, వెంకటేష్, అరుణ్, గోపాల్, సంజయ్, ఆదర్శ, పవన్, నాని, పావని, విశాలాక్షి, హేమ, అభిషేక్, తేజ పాల్గొన్నారు.

రైల్వే జిఎంకు అరుణ్ జైన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కు సామర్లకోట రైల్వే స్టేషన్ 3వ నెంబర్‌ప్లాట్ ఫాంపై గురువారం ఘన స్వాగతం లభించింది. దువ్వాడ నుంచి సామర్లకోట మీదుగా రాజమండ్రి ట్రాక్ పరిశీలన నిమిత్తం విండో ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా వెళుతున్న రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ మార్గ మధ్యలో సామర్లకోట స్టేషన్లో కొంతసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనకు రైల్వే సూపరింటెండెంట్ ఎమ్ రమేష్ ఆధ్వర్యంలో డీఈఎన్ శివప్రసాద్ తదితర ఉన్నతా దికారులు జీఎం అరుణ్ కుమార్ జైన్‌కు పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువాలు, పూలమాలలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. దువ్వాడ నుంచి రాజమండ్రీ వరకూ రైలు ట్రాక్ భద్రతా సామర్థ్యాన్ని పరిశీలించేందుకు జీఎం పర్యటిస్తున్న సందర్భంగా ఆయన సామర్లకోటలో ఆగినట్టు స్టేషన్ మేనేజర్ రమేష్ చెప్పారు. జీఎం వెంట ఆయన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, డిఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజరు నరేంద్ర వర్మ, సీనియర్ డివిజనల్ ఇంజనీరు కోఆర్డినేటషన్ వరుణ్ బాబు, ఎడిఇఎన్ బి శివప్రసాద్ తదితరులున్నారు.

లబ్ధిదారులకు నూతన పింఛన్ల పంపిణీ

జిల్లాలో పలుచోట్ల నూతనంగా మంజూరైన పింఛన్లను పలువురు ప్రజాప్రతినిదులు గురువారం పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

తాళ్లరేవు మండల పరిషత్‌లో ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, దున్నా జనార్ధనరావు, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, ఎంపిడిఒ ఎం.అనుపమ, వైసిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవింద్ కుమార్, రాయుడు గంగాధర్, మండల సేవాదళ్ అధ్యక్షులు భూసారపు పద్మారావు, ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకులు జి.అనిబాబు పాల్గొన్నారు. **పెద్దాపురం** వైసిపి ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కంటే వీరరాఘవరావు, చల్లా రామాంజనేయులు, మాగాపు సూరిబాబు, చంద్రు సురేష్, ప్రత్తిపాటి చౌదరి, పంచాయతీ కార్యదర్శి కళ, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకన్న బాబు, రాంబాబు, గంగాధర్, దొరబ్బాయి, మున్సిపల్ కౌన్సిలర్లు నీలంశెట్టి అమ్మాజీ, కట్టా రాజబాబు, విడదాసరి రాజా, వాసంశెట్టి గంగ పాల్గొన్నారు. **కరప** జనవరి నుండి పింఛను రూ.3000 ఇస్తామని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు అన్నారు. నూతనంగా మంజూరైన 299 పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఎంపిపి పెంకే శ్రీలక్ష్మీ సత్తిబాబు, జెడ్‌పిటిసి వై.సుబ్బారావు, ఎంపిడిఒ కె.అప్పారావు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, చింత ఈశ్వరరావు, సాదే విజయలక్ష్మి రాఘవులు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, రొక్కాల గణేష్ పాల్గొన్నారు. **జగ్గంపేటలో** ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి బిందు మాధవి, ఎంపిపి అట్లూరి నాగబాబు, డాక్టర్ ఒమ్మి రఘురాం, బండారు రాజా పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజాశక్తి దినపత్రిక 43వ వార్షికోత్సవం సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికను కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆవిష్కరించారు. కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాశక్తి తన ప్రస్థానంలో 42 ఏళ్లు పూర్తి చేసుకుని 43వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా వార్తలను ప్రచురిస్తూ ప్రజాశక్తి భవిష్యత్తులో దినదినాభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్.పావనమూర్తి, స్టాఫ్ రిపోర్టర్ ఎం.లక్ష్మణ్, సిబ్బంది సురేష్, రామకృష్ణ, ఎం.కృష్ణ, సోనీ పాల్గొన్నారు.

ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కార్టూ'నిజం'

ఎంతైనా మన సార్..'పబ్లిక్' కంటే 'పబ్లిసిటీ'కే ఎక్కువ ఖర్చు పెడతారురా.!!

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

జిల్లాలో పలుచోట్ల మండల స్థాయి క్రీడల పోటీలను గురువారం పలుచోట్ల ప్రారంభించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కోటనందూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో క్రీడా పోటీలను ఎంపిపి లగుడు శ్రీనివాస్ ప్రారంభించారు. విద్యా కమిటీ చైర్మన్ ఉల్లూరి శ్రీను, తుని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగ వెంకట కృష్ణాజీ, వైసిపి నాయకులు జి.దొరబాబు, దార్ల సూర్యచంద్ర, లంక ప్రసాద్, ఎంఇఒ శ్రీనివాస్ పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రాదేవి, ఎంపిడిఒ డి.శ్రీలలిత జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో పోటీలను ప్రారంభించారు. ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్‌ఎం కుసుమ ప్రసూన, పిఇటిలు పాల్గొన్నారు. **పెదపూడి** సంపర పాఠశాలలో హెచ్‌ఎం ఆర్.త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపిపి కేతా తులసి శ్రీనివాస్, సలాది విమల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిహెచ్‌సికి ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి -కరప

కరప పిహెచ్‌సికి రూ.8000 విలువైన నాలుగు సీలింగ్ ఫ్యాన్లను కాకినాడ న్యూరో స్టార్ వైద్యులు సతీష్ కుమార్ అందించారని వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. వీటిని కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు అందించారు. డాక్టర్ ఆశ, బాలా త్రిపుర సుందరి, శ్రీలక్ష్మి, గోపాలకృష్ణ అమ్మిరాజు, మూర్తి, స్వాతి పాల్గొన్నారు.

తుని దేవస్థానంలో హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-కోటనందూరు

తుని శ్రీ తలుపులమ్మ తల్లి దేవస్థానంలో గురువారం దేవాదాయ శాఖ తనిఖీ అధికారి సిహెచ్.ఉదయ నాయుడు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. 50 రోజులకు రూ.37,59,808 ఆదాయం సమకూరిందని అన్నారు. దేవస్థానం చైర్మన్ గొర్ల అచ్చినాయుడు కమిషనర్ పి.విశ్వనాథరాజు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పిఠాపురం

ఈ నెల 13న కాకినాడలో నిర్వహించిన అండర్ 14 ఆర్చరీ విభాగంలో స్థానిక ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు మహాలక్ష్మి, పల్లా నాని ఎంపికయ్యారు. వీరు జిల్లా తరపున త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఆర్చరీ పోటీలకు జిల్లా తరపున పాల్గొంటారన్నారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం విఎవి.రామకృష్ణ, పీడీ మంగాయమ్మ అభినందనలు తెలిపారు.

వాహనం ఢీకొని అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల పంచాయతీ కొత్తూరు వద్ద జాతీయ రహదారి చెంతన అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం వాహనం ఢీకొనడంతో స్వల్పంగా ధ్వంసం అయింది. దీంతో గ్రామస్తులు కొద్దిసేపు విగ్రహం వద్ద ధర్నా చేశారు. విగ్రహం పునర్నిర్మాణానికి సహకరిస్తానని వాహన యజమాని అంగీకరించడంతో ధర్నాను విరమించారు.

బకాయిలు చెల్లించకుంటే నిరసన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

తమ బకాయిలు చెల్లించకుంటే ఈ నెల 20 నుంచి దిగుమతులు నిలిపివేస్తామని సామర్లకోట ఐఎంఎల్ డిపో హమాలీ యూనియన్ అధ్యక్షుడు ఎన్‌వివి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు విప్పర్తి కొండలరావు హెచ్చరించారు. గురువారం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. జులై 4వ తేదీన ఎస్‌బిసిఎల్ ఎండి సమక్షంలో హమాలీ సంఘాలు, మద్యం సప్లయర్స్ అసోసియేషన్‌ల ప్రతినిధుల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు.

ఏటిమొగలో చేపల మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ దుమ్ములపేట సమీపంలో రూ.42.50 లక్షల వ్యయంతో నిర్మించిన చేపల మార్కెట్‌ను సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గురువారం ప్రారంభించారు. ఇటీవల మృతి చెందిన అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ బందన హరి పేరుతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ చేపలవేట చేసుకుని జీవనోపాధి పొందే మత్స్యకారులకు అధునాతన సౌకర్యాలతో నిర్మించిన ఈ మార్కెట్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ఎంతో కష్టించి పనిచేసిన బందన హరి పేరును ఈ చేపల మార్కెట్‌కు పెట్టామన్నారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, సుంకర శివప్రసన్న, ఎఎంసి ఛైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

మాజీ సిఎం చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా టిడిపి శ్రేణులో గురువారం ఆందోళనలు కొనసాగించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

కాకినాడ కార్పొరేషన్ మాజీ మంత్రి కెఎస్.జవహర్, మాజీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాలాజీ చెరువు సెంటర్‌లో దీక్షలు చేపట్టారు. నాగిడి నాగేశ్వరరావు, మాకిరెడ్డి భాస్కర్ గణేష్, పిట్టా వరప్రసాద్, మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, నరం శ్రీనివాసరావు, మల్లిపూడి నాగ దీపిక, చిక్కాల సత్యవతి, తుమ్మల సునీత, బంగారు సూర్యావతి, గుజ్జు దుర్గ, అంబటి క్రాంతి తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** దివిలి గ్రామంలో సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, కందుల విశ్వేశ్వరరావు, మొయిళ్ల కృష్ణమూర్తి, రేలంగి బుజ్జి, ఇంధన జయకృష్ణ పాల్గొన్నారు. **ఏలేశ్వరం** పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బాలాజీ సెంటర్లో మానవహారం చేపట్టారు. అనంతరం రిలే దీక్షలను సత్యప్రభ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు బొద్దిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, కోణాల వెంకటరమణ, యండగుండి నాగబాబు, నాయకులు జ్యోతుల పెదబాబు, సూది బూరయ్య, బొరుసు శ్రీనివాసచక్రవర్తి, మండపాక అలక్ రాజు, పలివెల శ్రీను, భజంతుల మణి పాల్గొన్నారు. **రౌతులపూడి** రిలే నిరాహార దీక్షల్లో నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ పాల్గొని మాట్లాడారు. తమరాల సత్యనారాయణ, పైల సాంబశివరావు, సోమరౌతు రవి, యామల సురేష్, సింహాద్రి పెదబాబు పాల్గొన్నారు. **అన్నవరం** బస్సు కాంప్లెక్స్ వద్ద మెరపల నరసయ్య ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఇన్‌ఛార్జి వరుపుల సత్య ప్రభ, నాయకులు పాల్గొన్నారు. **తొండంగి** నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య, యనమల కృష్ణుడు ఒంటిమామిడిలో దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. పోల్నాటి శేషగిరిరావు, మోతుకూరి వెంకటేష్, యనమల శివరామకృష్ణ, గాడి రాజబాబు, చింతంనీడి అబ్బాయి, మురాలశెట్టి సత్యనారాయణ, పేకేటి హరిబాబు, చొక్కా కాశీ, చొక్కా అప్పారావు, సిద్దా రాంబాబు, కోడా రమణ కొయ్యా కేశవ్ లెక్కల భాస్కరరావు పాల్గొన్నారు.

కాకినాడలో..

ప్రతిభ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనకబడ్డ విద్యార్థులకు ఉన్నత చదువులకు సహకరించాలని ఉద్దేశంతో ఏటా ప్రతిభా స్కాలర్షిప్ ట్రస్ట్ అందిస్తున్న ఉపకారవేతనానికి దరఖాస్తులు చేసుకోవాలని ట్రస్ట్ కార్యదర్శి ఎండి ఇబ్రహీం ఖాన్ తెలిపారు. అమెరికా ఎన్నారై చెక్కపల్లి రమేష్ ఆర్థిక సాయంతో 2012లో ట్రస్ట్ ప్రారంభించి ఎంతోమంది విద్యార్థులకు ఇప్పటికే ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. ఐఐటి, మెడిసిన్, ఇంజనీరింగ్, జేఇఇ ఎంట్రన్స్ టెస్ట్‌లో 10000 లోపు ర్యాంకు పొంది ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు చదువు ముగిసే వరకు ఏటా సంవత్సరం స్కాలర్షిప్ అందజేస్తామన్నారు. అర్హత గల విద్యార్థులు www.prathibhascholarship.com వెబ్ సైట్ నుండి అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను వరుపుల చిట్టిబాబు, గణపతి సాయి బ్యాంకర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా, ఏలేశ్వరం-533429, కాకినాడ జిల్లా, చిరునామాకు పంపించాలని, మరిన్ని వివరాలకు 9951367872, 9948417174 నంబర్లలో సంప్రదించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను 15-10-2023 పంపించాలని ఆయన కోరారు.

ముగిసిన గడపగడపకూ ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజా సమస్యలను స్వయంగా పరిశీలించి, పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తలపెట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కాకినాడ సిటీ నియోజకవర్గంలో గురువారం ముగిసింది. కాకినాడ 15వ డివిజన్ ఏటిమొగ ప్రాంతంలో ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైసిపి నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పలువురు మాజీ కార్పొరేటర్లు అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముగింపు సందర్భంగా బెలూన్లు ఎగురవేసి, బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 2022 మే 11న ప్రారంభించిన గడపగడపకు మన ప్రభుత్వం ఏడాది నాలుగు నెలల పాటు ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఎంతో దోహద పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్, జెసిఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, నల్లబిల్లి సుజాత, రాగిరెడ్డి బన్నీ, కర్రి శైలజ, చెవ్వాకుల రాంబాబు, రోకళ్ల సత్యనారాయణ, తెహరా ఖాతూన్, రాజాన ప్రకాష్ పాల్గొన్నారు.

ముగింపు సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ ద్వారంపూడి

వల్లభ స్వామి హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతిలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయంలో స్వామివారి హుండీలను గురువారం లెక్కించగా రూ.25,15,938, అన్నదానం హుండీల ద్వారా రూ.6,84,780 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు ఎంఎం.వీరభద్రరావు, బివిఆర్.చౌదరి, ధర్మకర్తల మండల చైర్మన్ కర్రి జగదీశ్వరరావు సమక్షంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కింపు జరిపారన్నారు.

సబ్సిడీ వాహనం అందజేత

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆక్వా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ప్రత్యేక సబ్సిడీతో మంజూరు చేసిన ఇన్సులేటెడ్ వాహనాన్ని ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ లబ్ధిదారురాలైన నల్లి విజయ నిర్మలకు అందజేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ వాహనం తాళాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లావణ్య మాట్లాడుతూ 2021-22 సంవత్సరానికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ఆంధ్రప్రదేశ ప్రభుత్వం రూ.22.99 లక్షల విలువైన వాహనాన్ని 60 శాతం సబ్సిడీతో అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం రూ.12 లక్షల సబ్సిడీ ఇచ్చిందన్నారు. ఎంపిపి రాయుడు సునీత, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, రాయుడు గంగాధర్, కాశి లక్ష్మణస్వామి, ఎఫ్‌డిఒ గోపి, నల్లి బాలకృష్ణ, కామాడి మాతరాజు, వెంటపల్లి నూకరాజు, పంపన రామకృష్ణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వడ్లూరులో నీలిమ గెస్ట్ హౌస్‌లో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌పి పి.జగదీష్ ఆదేశాలతో పేకాట శిబిరంపై దాడి చేశామని ఎస్ఐ కె.రామారావు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి మండలంలోని వడ్లూరులో ఉన్న ఒక గెస్ట్ హౌస్‌లో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో నిడదవోలు సిఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుల నుంచి రూ.22,10,870 నగదు, 2 కార్లు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడులను సక్రమంగా నిర్వహించి నిందితులను పట్టుకున్న ఎస్ఐ కె.రామారావు, హెచ్‌సి.నాగేశ్వరరావు, పిసిలు రమేష్, ముత్యాలరావు, జయరామ్, సత్యనారాయణకు రాజమహేంద్రవరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రశంసా పత్రాలను ఎస్‌పి అందించారు. గెస్ట్ హౌస్ యజమానులు భూపతి వెంకట నర్సింహరాజు, డొక్కా సోమయ్యల పైనా కేసు నమోదు చేసినట్లు ఎస్‌పి జగదీష్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల మండలం అనంతపల్లి సమీపంలో పోలవరం కుడి కాలువపై ఉన్న సైఫాన్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు నల్లజర్ల పోలీసులు తెలిపారు. గురువారం గ్రామ రైతులు కొందరు అటుగా వెళుతూ దుర్వాసన రావడంతో కాలువలోకి వంగి చూడగా నీటిపై తేలియాడుతూ పూర్తిగా పాడైపోయిన దశలో ఉన్న మృతదేహాన్ని చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విఆర్ఒ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ృతదేహాన్నితాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వికె.రాయపురం సమీపంలోని మామిళ్ళదొడ్డి ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియనివ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల మేరకు మామిళ్లదొడ్డి వద్ద నివాసాలకు దూరంగా ఒక చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మతుని వయస్సు 35 ఏళ్ళ ఉంటాయన్నారు. శరీరంపై సిమెంట్ రంగు ప్యాంటు, నీలం రంగు డ్రాయరుఉందన్నారు. 5.6 అడుగులు ఎత్తు ఉంటారన్నారు. మృతుని బంధువులు ఎవరైనా ఉంటే సామర్లకోట పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బాలుని అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం నడిపూడి నక్కావారిపేటకు చెందిన నక్కా శ్రీతేజ(15) అదృశ్యమయ్యాడని అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. శ్రీతేజ కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. అక్కడే ఎస్‌సి హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 11 మధ్యాహ్నం 3 గంటలకు శ్రీతేజ హాస్టల్ నుంచి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం 7.30 గంటల సమయంలో శ్రీతేజ కొత్తపేట హాస్టల్‌కు వెళుతున్నానని చెప్పి ఇంటి నుండి బయలుదేరాడు. అప్పటి నుంచి అదృశ్యమయ్యాడు. దీంతో బాలుని తండ్రి నక్కా శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ 9440796562, 9440796525 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం

పోలీసులు, ఎస్ఇబి అధికారులు, సిబ్బంది మండలంలో సారా తయారీ కేంద్రాలపై గురువారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3వేల లీటర్ల బెల్లపు ఊటను, పది లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. 9 మందిపై కేసులు నమోదు చేశామని దేవరపల్లి ఎస్ఇబి సిఐ డి.సుధ తెలిపారు. గోపాలపురం మండలంలోని కరగపాడు, బుచ్చిపాలెం గ్రామాల్లో ఈ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఎస్ఇబి సిఐ డి.సుధ, పివి రమణ, వీరబ్రహ్మం, ప్రసాద్, ఎస్ఐలు రాజశేఖర్, సుధీర్, బసంతి, దేవరపల్లి సిఐ అనసూయ శ్రీనివాసరావు, ఎస్ఐలు శ్రీహరి, సతీష్ కుమార్, నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భవ'పై అవగాహన

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో దేశ ప్రజల ఆరోగ్య రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుస్మాన్ భవ పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రపురం డివిజన్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.సుదర్శన్‌బాబు మాట్లాడారు. ప్రజలందరికీ చేరువ చేసేందుకు ఆశాలంతా కష్టపడి పనిచేయాలన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోనీ 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, 4 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఆశాలు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికీ దేశ వ్యాప్తంగా అమల్లో ఉండే ఆభా ఐడిని క్రియేట్ చేయాలన్నారు. ప్రతి చోట గ్రామ సభలు నిర్వహించి ఈ అభా కార్డులు పంపిణీ చేయాలన్నారు. వీటి ద్వారా ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజనా పథకం వర్తింపజేసి ప్రజలకు దేశ వ్యాప్తంగా వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీలో లేని ఎన్నో వ్యాధులకు ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజనా

పథకంలో వైద్యం అందుతుందన్నారు. సంవత్సరానికి రూ.5 లక్షల రూపాయలు లోపు ఆదాయం కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు.

జగ్గంపేట శ్రీచైతన్య పాఠశాలలో హిందీ దినోత్సవం

ఘనంగా హిందీ దినోత్సవం

ప్రజాశక్తి - పెరవలి

కానూరు మల్లేశ్వరం కాకరపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. హిందీ పండిట్ సిహెచ్‌విఎస్.నాగభూషణం మాట్లాడారు. జాతీయ సమైక్యతకు దోహదం చేసే జాతీయ భాష హిందీని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు అనంతరం విద్యార్థులు హిందీలో పద్యాలు, దేశభక్తి గీతాలు ఆలపించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సరసున్నేసా, సిహెచ్. అప్పారావు, నిర్వాహకులు డాక్టర్ ఎస్.తులసిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగ్గంపేట : స్థానిక బాలాజీనగర్ జగ్గంపేట శ్రీచైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్లో జాతీయ హిందీ భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణమూర్తి మనవరాలు, మనువడు ఎస్.రాజేశ్వరి, ఎస్.గణేష్ గుర్తుగా పాఠశాలకు 200 మొక్కలను ప్రిన్సిపల్ జి.శ్రీనుకు అందించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎజిఎం వైఎన్ఎస్, ఆర్‌టిపి.శ్రీనివాసు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. హిందీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ నాగేంద్ర, సి-బ్యాచ్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎఒ సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల విద్యుత్ కనెక్షన్లపై ఫిర్యాదు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

మున్సిపాలిటీ పరిధిలోని పిఠాపురం రోడ్‌లో గృహ సముదాయాల లబ్ధిదారుల నుంచి విద్యుత్ కనెక్షన్లు పొందేందుకు రెండోసారి డిపాజిట్లు చెల్లించాలని విద్యుత్ అధికారులు చేస్తున్న డిమాండ్లపై జిల్లా మానవ హక్కుల సంఘం ఆధ్వర్యాన గురువారం ఫిర్యాదు చేశారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఈ ఫిర్యాదు అందించారు. వినియోగదారుల ఫోరం చైర్మన్ రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ, సభ్యులుగా రిటైర్డ్ ఎపి స్టడీ సర్కిల్ సంచాలకులు డాక్టర్ రాయసం సురేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ టిడ్కో గృహాల లబ్ధిదారుల నుంచి విద్యుత్ కనెక్షన్ల నిమిత్తం గతంలో రూ.450 విద్యుత్ అధికారులు వసూలు చేశారన్నారు. ప్రస్తుతం మళ్లీ కనెక్షన్లు పొందేందుకు మరో రూ.450 డిపాజిట్ చెల్లించాలని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఒకే కనెక్షన్‌కు రెండు పర్యాయాలు డబ్బులు చెల్లించాలా అని ఆయన ప్రశ్నించారు. లేదంటే మొదట చెల్లించిన రూ.450 లు విద్యుత్ శాఖకు జమ కాలేదా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం నాయకులు కుంచే నానిబాబు, జుత్తుక అప్పారావు, ఎండి వలీ బాషా ఉన్నారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జయ రామారావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం పట్టణ పరిధిలోని ఎఎన్ఎంలు, వాలంటీర్లతో ఈ కార్యక్రమంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 15వ తేదీ శుక్రవారం నుంచి పట్టణ పరిధిలోని270 క్లస్టర్ల పరిధిలో వాలంటీర్లు అన్ని గృహాలనూ సందర్శించి ఆరోగ్య సురక్ష యాప్‌లను ప్రజల ఫోన్లో డౌన్లోడ్ చేయించి వారి ఆరోగ్య సమస్యలపై సర్వేను నిర్వహిస్తారన్నారు. సర్వే అనంతరం ఎఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబంలోని సభ్యులందరికీ బిపి, సుగర్, హెచ్‌బి, మలేరియా, డెంగ్యూ, యూరిన్ పరీక్షలు ఉచితంగా జరిపి అవసరమైన మందులను అందిస్తారన్నారు.

రెండు విడతలుగా ఆరోగ్య శిబిరాలు

పట్టణ పరిధిలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండగా వాటి పరిధిలో ఈనెల 30న, అక్టోబర్ 9వ తేదీన ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగానే ఈనెల 30న గాంధీ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ లో 3, 4, 6, 9, 11, 14, 15 వార్డులకు అక్టోబర్ 9న 1, 6, 8, 9, 10, 12, 15 వార్డులకు వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరాల్లో ప్రముఖ వైద్యులు, ఎఎన్ఎంలు పాల్గొని వైద్య సేవలను ఉచితంగా మందులను అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పరిధిలో ఉన్న ప్రైవేటు వైద్యులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్లను కమిషనర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బాబును జైలుకు పంపడం అన్యాయం

ప్రజాశక్తి - గోపాలపురం

మాజీ సిఎం చంద్రబాబును అక్రమ కేసుల్లో జైలుకు పంపడం అన్యాయమని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు అన్నారు. టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ రంగాన్ని నెలకొల్పి నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, నిరుపేదలకు అండగా నిలిచాయని గుర్తుచేశారు. అక్రమార్జనతో 16 నెలలు జైలు జీవితం గడిపిన జగన్ రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేశారని పేర్కొన్నారు. ప్రశ్నించడమే తప్పుగా భావిస్తున్న జగన్ పోలీసులతో ఆ గొంతుకలను నొక్కేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిన్నమనేని నాగేంద్ర, కొర్లపాటి రాము, కొర్లపాటి అన్నవరం, పరిమి జగదీష్, ఇల్లూరి రాంబాబు, జ్యేష్ట శ్రీనివాసరావు, ఈలీ శరత్ బాబు, పోసిన గణపతి టిడిపి నాయకులు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు పటిష్ట ప్రణాళిక

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్యసురక్ష పథకాన్ని పటిష్టవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు, ప్రజారోగ్య విభాగంతోపాటు ఆయా శాఖల అధికారులకు సూచించారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఈ అంశంపై గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి ప్రతీ ఇంటికి వెళ్ళి ప్రజలను నేరుగా కలిసి ఆరోగ్యసమస్యలు ఏమైనా ఉంటే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. అనారోగ్య బాధితులకు అవసరమైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ నుంచి నిపుణులైన వైద్యులతో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎఐఎస్‌ఎఫ్ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు స్థానిక సిపిఐ కార్యాలయంలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ సమరశీల విద్యార్థి ఉద్యమాల రథసారథి భారతదేశ లోకానికి స్ఫూర్తిని చైతన్యాన్ని కలిగించి సంఘటితశక్తిగా ముందుకు నడిపించే చోధక శక్తి అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఈ రెండు ప్రభుత్వాలను ఇంటికి సాగనంపేంత వరకు ఉద్యమాలు రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వి కొండలరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతలపూడి సునీల్, పట్టణ నాయకులు ఎంద్రపాటి సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని మల్లవరం ఫీడర్ పరిధిలో శుక్రవారం 33 కె.వి ఫీడర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని 33/11 కె.వి.మల్లవరం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని విద్యుత్ శాఖాధికారి సుంకర శ్రీనివాస్ తెలిపారు. 11 కె.వి మల్లవరం లోకల్ ఫీడర్, 11 కె.వి కె.వి గౌరిపల్లి ఫీడర్ మరియు 11 కె.వ మార్కొండపాడు ఫీడర్లు కు వార్షిక మెయింటనేన్సు, ఎరెక్షన్ ఆఫ్ పోల్స్ వర్క్ నిమిత్తం ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.కావున మల్లవరం, చంద్రవరం, గౌరిపల్లి, మార్కొండపాడు ప్రజలు సహకరించాలని కోరారు.

పరిశోధనలపై ఆసక్తిని పెంచాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థుల్లో చిన్ననాటి నుండి పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు బి.అనంతరావు అన్నారు. ఎపి సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ప్రకాష్ సెనర్జీ స్కూల్లో గురువారం జరిగిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ సైన్స్ ఉపాధ్యాయుల అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రతి పాఠశాల నుండి ఒక సైన్సు ప్రాజెక్టును విద్యార్థులు తయారు చేసే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ సంవత్సరం ఆరోగ్యం, సంక్షేమం, పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం అనే ప్రధాన అంశాలపై ప్రాజెక్టులు చేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ పిల్లల ఆలోచనలకు పదును పెడుతూ వారిలో సృజనాత్మకతను వెలికి తీస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. బాల శాస్త్రవేత్తలు తయారు చేసే వేదికలుగా సైన్స్ కాంగ్రెస్

సమావేశంలో మాట్లాడుతున్న అనంతరావు

ఉంటుందన్నారు. జిల్లా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, శ్రీ ప్రకాష్ స్కూల్ కల్చరల్ కో ఆర్డినేటర్ కె.ఉష చైతన్య మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడంలో సైన్స్ కాంగ్రెస్ ఎంతో సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ కె వెంకటరావు, ఎం.ప్రశాంతి, కుమార్ రాయ్, కెవికె.మహేశ్వరరావు, కుమారస్వామి, బి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి - పెరవలి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహశీల్దార్ టి.రాజేశ్వరి సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల లిస్టుల్లో మార్పులు, చేర్పులు, ఓట్ల తొలగింపు, కొత్త ఓట్ల వెరిఫికేషన్‌పై రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. నడిపల్లి గ్రామం శిథిలావస్థలో ఉన్న మూడు పోలింగ్ కేంద్రాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ వెంకటేశ్వరరావు, సిబ్బంది, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎఎంసి భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి అమలాపురం రూరల్

అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించిన రైతు బజార్‌లో మార్కెటింగ్ కమిటీ భవన నిర్మాణం కోసం గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దంగేటి డోలామణి రుద్ర స్థలాన్ని పరిశీలించారు. చైర్ పర్సన్‌తో పాటు మార్కెటింగ్ డిఇ వెంకటేశ్వరరావు, ఎటిఎం కెఎస్‌వి.విశాలాక్షి, మార్కెట్ కమిటీ సెక్రటరీ వి.రామకృష్ణ, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పేద మహిళకు సర్పంచ్ సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరుకు చెందిన నిరుపేద ఒంటరి మహిళ పరాకుల పాప ఆర్థికంగా వెనుకపడి అనారోగ్యంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ గుణ్ణం రాంబాబు గురువారం ఆమెకు కావలసిన నిత్యావసర సరుకులను, రూ.2 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మానవత్వం చాటిన రాంబాబును పలువురు అభినందించారు.

విద్యాసంస్థల్లో డివైఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడిలోనే పలు ప్రైవేట్ విద్యాసంస్థలను డివైఇఒ రామన్నదొర శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, విజేత హైస్కూల్‌ను తనిఖీ చేసి అక్కడ జరుగుతున్న విద్యాబోధనను ప్రత్యేకించి 10వ తరగతి విద్యార్థులను పరిశీలించి విద్యార్థుల రికార్డులను ఆయన తనిఖీ చేశారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డివైఇఒ

ఇఒపిఆర్‌డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - దేవరపల్లి

మండల ఇఒపిఆర్‌డిగా పి.ప్రభాకరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిశోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ గుర్తింపు పట్ల హర్షం

ప్రజాశక్తి- గోకవరం

ఎపిఎస్ ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్న ఎంప్లాయీస్ యూనియన్‌ని ప్రభుత్వం గుర్తింపు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని ఆ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ 1952 జూలై 11న యూనియన్ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కార్మికుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడిందన్నారు. యూనియన్‌కు గుర్తింపు ఇచ్చి ఉద్యోగుల సమస్యలపై అధికారికంగా మాట్లాడే అవకాశాలు ఇచ్చినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో చైర్మన్ పైడిమల్ల లక్ష్మణరావు, ప్రగడ ప్రసాద్, అక్కిరెడ్డి కృష్ణ, అప్పాజీ, జ్యోతక్క, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

'బాబుతో నేను' కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక 11వ డివిజన్ ఇన్‌ఛార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో "బాబుతో నేను" పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని ఇంటింటికీ వెళ్లి 'బాబుతో నేను' కరపత్రాలను ప్రజలకు అందచేసి చంద్రబాబు అరెస్టు వెనుక ఉన్న కుట్రను, జగన్ నియంత పాలనను అవగాహన చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సిఎం జగన్‌కు ఉన్న అవినీతి మరకలు చంద్రబాబుకు అంటించాలనే ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబును వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ కుట్రలో భాగంగానే చంద్రబాబును అరెస్టు చేశారని మండిపడ్డారు. తమ కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ఆయన వెంటే ఉంటామన్నారు. సిఎం జగన్ ప్రజా వ్యతిరేక చర్యలను చంద్రబాబు తన పర్యటనల్లో జనానికి వివరిస్తుండడంతో ఓటమి భయంతోనే అక్రమ అరెస్టుకు కుట్ర చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు రేగేటి సూరిబాబు, గరికిన రామారావు, అడబాల నాగరాజు, జాజుల గోవిందరాజులు, తోట కిరణ్, చొప్పెర్ల భద్రరావు, రవితేజ, టి అంజనేయులు, కోర్పు రామారావు, సుంకర చౌదరి, నడిమింటి సత్తిబాబు, నడిమింటి సత్యవేణి, గొర్రెల కష్ణ, గొర్రెల పద్మ, విజయ, సంతు, సోమేశ్వరరావు, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించిన చింతా మోహన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక కోర్లమ్మపేటలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని సీనియర్ కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సోడదాసి మార్టిన్ లూథర్, నల్లబాటి శ్యామ్, కిషోర్ జైన్, మోతా శారద, నందు, తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో చింతా మోహన్ పలు విషయాలపై ముచ్చటించారు. అన్ని వర్గాలు తిరిగి కాంగ్రెసు వైపు ఆకర్షితురాలవుతున్నారని, మళ్ళీ పూర్వ వైభవం వస్తుందని ఈ సందర్భంగా చింతా మోహన్ అన్నారు...........

ఇంజనీర్స్ డే శుభాకాంక్షలతో...



Bharat Rathna
Sir Mokshagundam Visvesvaraya
(15 September 1860 – 14 April 1962)

విశ్వ విఖ్యాత ఇంజనీరు
కీ॥శే॥ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి
జయంతి సందర్భంగా ఆయన
సేవలు స్మరించుకుంటూ...
అందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు...

అమజాల వి.వి.ఎస్.సూర్యనారాయణ దొరబాబు
జిల్లా అధ్యక్షులు
జిల్లా పరిషత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్
కాకినాడ జిల్లా

యానాం వార్తలు

వినతిపత్రం అందిస్తున్న పలువురు నాయకులు

ఇడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - యానాం

అగ్రవర్ణ పేదలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇడబ్ల్యుఎస్(ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్) ధ్రువపత్రాలు జారీ చేయడంలో యానాం రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్టిఫికెట్లు త్వరగా ఇవ్వాలని కోరుతూ యానాం కాపు సంఘం సభ్యులు, కాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంస్థ, బిఎస్‌పి నాయకులు ఆర్‌ఎఒ మునిస్వామికి గురువారం వినతిపత్రం అందించారు. ఇటీవల ఎల్‌డిసి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా అభ్యర్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల తీరు మార్చుకోవాలన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి సమస్యను వివరించారు.సర్టిఫికెట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతం రామకృష్ణ, తోట వినోద్ కుమార్, చెక్కల అరుణ్‌కుమార్, ధూళిపూడి మధు, నల్లా రత్న నాయుడు,గుండాబత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

132 కెవి లైన్ల మార్పు కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4గంటలు వరకు యానాం నియోజవర్గంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ లంక కష్టారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

బహుమతులు అందిస్తున్న ఆర్ఎఒమునిస్వామి

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

యానాంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాహనా సదస్సును గురువారం నిర్వహించారు. పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సౌజన్యంతో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ హాజరై మాట్లాడారు. హెచ్ఐవి, ఎయిడ్స్ సోకే విధానం, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణసుధాకర్, అధ్యాపకులు వాసంశెట్టి ఆనంద్, ప్రసాదరావు, నారాయణరావు పాల్గొన్నారు.

ఫోటో,వీడియో గ్రాఫర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గ్రామీణ ఫోటో, వీడియో గ్రాఫర్లను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని లూయిస్ ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గొల్లవిల్లిలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టుగానే తమ వృత్తిని కూడా గుర్తించి తగు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి జానా భవాని శంకర్, జంగా రవికుమార్, అంబటి వెంకటేశ్వరరావు, చోడిశెట్టి ఆదినారాయణ, ముంగండ సత్తిబాబు, మోసుగంటి ప్రసాద్, దోనిపాటి రాంబాబు, పోలినాటి భీమేశ్వర రావు, అంబటి నరేష్, కొంకి అరవింద్,సూదా వెంకటరత్నం,డి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

తూర్పుగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, కురుకూరు గ్రామానికి చెందిన మద్దిపాటి భవాని, C/o. నారాయణ అను నాకు **S0956743** నెంబరు గల పాస్‌పోర్టు కలదు. మేము ఇల్లు మారుతుండగా బ్యాగు పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. పాస్‌పోర్టు గల బ్యాగు ఎవరికైనను దొరికిన యెడల ఈక్రింది గల ఫోన్ నెంబరుకు, అడ్రసుకు తెలియజేయగలరు.

మద్దిపాటి భవాని
C/o. నారాయణ, డో.నెం. 1-30
ఎస్.సి. ఏరియా, కురుకూరు గ్రామం
దేవరపల్లి మండలం, తూ॥గో॥జిల్లా
సెల్: 6309820439

మహారాజశ్రీ ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 85/2022

Between:

వాసంశెట్టి వెంకటరావు -వాది

AND

కొల్లిపార కృష్ణ కిషోర్, S/o. నాగయ్య, 43 సం॥లు, హిందువు, వ్యాపారం, డో.నెం. 6-75, 7వ వార్డు, ముమ్మిడివరం, నగరం పంచాయతి. -ప్రతివాది

యీ నెంబరు దావాలో వాది, ప్రతివాదిపై ప్రాంశరీ నోటు బాకీ వసూలు నిమిత్తం యీ దావా దాఖలు చేసినారు. సదరు దావాలో మీ తాలూకు షెడ్యూలు దాఖలా ఆస్తిని జప్తు చేయించుమని I.A. 292/2022 రు పిటీషను దాఖలు చేసినారు. సదరు దావాలో జప్తు పిటీషనులో శ్రీ కోర్టు వారి ద్వారా రిజిష్టీ పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు మరియు నోటీసులు పంపించినను తీసుకొనచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం **ది. 18-09-2023 సం॥రం తేదీ వాయిదా** అయి తెలియచేయడమైనది. మీరు **వాయిదా తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా తేదీ: 18-09-2023

చింతపల్లి అజయ్‌కుమార్
ముమ్మిడివరం — అడ్వకేట్, అమలాపురం
14-09-2023 — సెల్: 9849864699